నమస్తే తెలంగాణ

హైదరాబాద్, బుధవారం, 22 జనవరి 2025
WEDNESDAY, JANUARY 22, 2025


గుండాల : అనంతారం గ్రామంలో జాబితాలో తమ పేర్లు లేవని అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు


ఆత్మకూరు(ఎం) : రాయిపల్లిలో దరఖాస్తు ఫారాలు లేకపోవడంతో తెల్లకాగితంపై పేర్లు రాస్తున్న గ్రామస్తుడు బ్రహ్మచారి


బీబీనగర్ : రహీంఖాన్‌గూడెంలో అనర్హులను ఎంపిక చేశారని అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు.



భువనగిరి కలెక్టరేట్ : తాజ్‌పూర్‌లో ప్రజాపాలన గ్రామసభలో సంక్షేమ పథకాలపై అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

# గ్రామసభలు రసాభాస

- జాబితాలో అనర్హుల పేర్లున్నాయని ఆందోళన
- తూతూ మంత్రంగా సభలు
- అధికారులను ఎక్కడికక్కడ నిలదీసిన ప్రజలు
- బీబీనగర్‌లో దరఖాస్తు ఫారాలను రూ.5కు విక్రయించిన అధికారులు


ఆలేరు టౌన్ : పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో నిర్వహించిన గ్రామ సభలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య రాక కోసం నిరీక్షిస్తున్న అధికారులు, ప్రజలు


భూదాన్ పోచంపల్లి : జలాల్‌పూర్‌లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు


రాజాపేట : కాల్వపల్లిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల, పక్కన కలెక్టర్ హనుమంతరావు


సంస్థాన్ నారాయణపురం : చిమిర్యాలలో నిరుపేద కుటుంబమైన తమకు రేషన్ కార్డు, ఇల్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీస్తున్న మహిళలు

గుండాల, జనవరి 21 : మండలంలో ప్రజా పాలన గ్రామసభలు రసాభాసగా సాగాయి. మండలంలోని వంగాల, గంగాపురం, సుద్దాల, అనంతారం, మాసాన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం అధికారులు ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ రైతు భరోసా పథకాల లబ్ధిదారుల వివరాలను గ్రామసభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్నతంగా ఉండే భూస్వాముల పేర్లు లిస్టులో వచ్చాయని, నిరుపేదల పేర్లు జాబితాలో లేవంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పేర్లు లబ్ధిదారుల జాబితాలో వస్తున్నాయని ఆరోపిస్తూ అధికారులను నిలదీశారు. అయితే జాబితాలో ఉన్న పేర్లే ఫైనల్ కాదని.. వీళ్లు కేవలం అర్హులు మాత్రమేనని లబ్ధిదారులుగా ప్రకటించలేదని అధికారులు చెప్పడం కొసమెరుపు. ఆయా కార్యక్రమాల్లో తాసీల్దార్ జలకుమారి, ఎంపీడీఓ శంకరయ్య, ఏపీఎం అంజయ్య, ఐబీ ఏఈ పరమేశ్వర్, పశువైద్యాధికారి డా.యాకూబ్, డీటీ నీలిమ పాల్గొన్నారు.

## మోటకొండూరులో ప్రశ్నల వర్షం

మోటకొండూర్ : మండలంలోని ఆరెగూడెం, పెద్దబావి(సాకంపల్లి), అమ్మనబోలు, చందేపల్లి, నాంచారిపేట, కొండాపూర్ గ్రామాల్లో అధికారులు మంగళవారం నిర్వహించిన గ్రామ సభలు రసాభాసగా సాగాయి. చందేపల్లి, ఆరెగూడెం, అమ్మనబోలు గ్రామాల్లో గ్రామసభల్లో అధికారులపై గ్రామస్తులు ప్రశ్నల వర్షం కురిపించారు. అసలైన అర్హుల పేర్లు కాకుండా జాబితాలో అనర్హుల పేర్లు వచ్చాయని అధికారులను నిలదీశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు కూడా అనర్హులకే వచ్చాయని మండిపడ్డారు. అమ్మనబోలులో గ్రామసభను అధికారులు తూతూ మంత్రంగానే చేపట్టి నిమిషాల వ్యవధిలోనే ముగించారు. నాలుగు పథకాల తీరు నచ్చలేదంటూ ఆయా గ్రామాల్లో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఇందిర, డీటీ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్, ఎంపీఓ చంద్రశేఖర్, ఏఓ రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు నందాల సాయికుమార్, శ్రీనివాస్, స్వాతి, భవానీ తదితరులు ఉన్నారు.

## ఆత్మకూర్(ఎం)లో అధికారుల నిలదీత..

ఆత్మకూరు(ఎం) : మండలంలోని సింగారం, రాయిపల్లి, సర్వేపల్లి, లింగరాజ్‌పల్లి, మోదుగుబావిగూడెం, ఉప్పలపహడ్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలు గందరగోళంగా, అధికారులను నిలదీత మధ్య కొనసాగింది. గ్రామస్తులు మాట్లాడుతూ జాబితాలను చదివి వినిపించడం కాదు నిజమైన అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందివ్వాలని అధికారులను నిలదీశారు. దరఖాస్తు ఫారాలను లేకపోవడంతో కేవలం తెల్ల కాగితాలపై పేర్లు రాసి అందించారు. తాసీల్దార్ రవికుమార్, డీటీ షఫియోద్దీన్, పాల్గొన్నారు.

## రాయరావుపేటలో రచ్చ..

బీబీనగర్ : మండలంలోని రాయరావుపేట్, గుర్రాలదండి గ్రామాల్లో గ్రామ సభ నిరసనల మధ్య సాగింది. గ్రామ సభలో అధికారులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పేర్లు గ్రామ సభలో కనిపించడం లేదని, అధికారులు, ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతున్నారని గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేశారు. రాయరావుపేటలో గ్రామస్తులందరు ఒక్కసారిగా అధికారులను ప్రశ్నించే సరికి పోలీసులు కలుగజేసుకొని శాంతింపజేశారు. గుర్రాలదండి గ్రామంలో ఆత్మీయ భరోసా జాబితాలో 20 మంది పేర్లుండగా అందులో ప్రభుత్వ ఉద్యోగితో పాటు భూములున్న వారినే ఎంపిక చేశారని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

## పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భానోతు లాలు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఆత్మీయ భరోసా పథకంలో మొత్తం అనర్హులను ఎంపిక చేశారని, అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. దరఖాస్తు ఫారాలను అధికారులు 5 రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపించారు.

## అన్ని పథకాలు ఉన్నోళ్లకేనా?

మోత్కూరు : భూములు, ఇండ్లు, వ్యాపారాలు ఉన్నవాళ్ల పేర్లే పథకాల అర్హుల జబితాలో ఉన్నాయని మండలంలో జరిగిన గ్రామ సభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. మండలంలోని దాచారం, అనాజిపురం, పాలడుగులో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. దాచారం గ్రామానికి చెందిన గాదె జనార్దన్‌కు గ్రామంలో ఇల్లు ఉండగా, గత ప్రభుత్వం హైదరాబాదులోని రాంపల్లిలో డబుల్ బెడ్రూమ్ ఇల్లు కేటాయించిందని, ఇప్పుడు మళ్లీ ప్రభుత్వం విడుదల చేసిన ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఆయన పేరు ఉందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన నిరుపేద షేక్ షరీఫ్ అంధుడు కాగా ఆయనకు కనీసం ఇల్లే లేదని ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆయన పేరు జాబితాలో లేదని మండిపడ్డారు.

## గ్రామసభకు ఆలస్యంగా ప్రభుత్వ విప్ బీర్ల.. ప్రజల అసహనం

రాజాపేట/ఆలేరు టౌన్ : రాజాపేట మండలంలోని కాల్వపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ హనుమంత్‌రావుతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హాజరయ్యారు. ఆలేరు మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన గ్రామసభలో ప్రభుత్వ విప్ అయిలయ్య హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు జరుగాల్సిన గ్రామ సభ ఎమ్మెల్యే రాక ఆలస్యం కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సుమారు 2 గంటల పాటు బీర్ల అయిలయ్య కోసం ఎదురు చూసి అసహనం వ్యక్తం చేశారు. ఆలేరు మున్సిపైల్ చైర్మన్ వస్పరి శంకరయ్య 12 గంటల వరకు ఎదురు చూసి వెనుదిరిగారు.

- ఆలేరురూరల్ : ఆలేరు మండలంలోని మంతపురి గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి గోపాల్, తాసీల్దార్ అంజిరెడ్డి, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిల్‌ను నిలదీత

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పూర్, మెహర్‌నగర్, గాంధీనగర్, పద్మా నగర్, మహమ్మాయికాలనీలో గ్రామసభలు నిర్వహించారు. జలాల్‌పూర్, మెహర్‌నగర్ గ్రామ సభల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. అయితే లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవంటూ ప్రజలు ఎమ్మెల్యేను నిలదీశారు. ఉపాధి హామి జాబితాలో 13 మంది పేర్లు ఉన్నా వారందరూ ఇతర కంపెనీల్లో పనులకు వెళ్లేవారని, భూమి ఉన్నవారి పేర్లను జాబితాలో చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ ఆఫీసర్ భార్య పేరు కూడా జాబితాలో ఉందని నిలదీశారు. కార్యక్రమంలో డీపీఓ సునంద, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

- సంస్థాన్ నారాయణపురం : మండలంలోని అల్లందేవిచెరువు, చిమిర్యాల, గుజ్జ, చిల్లపురం, గంగముల తండా, కడపగండి తండా, కడిలబావి తండా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. అనర్హుల పేర్లు జాబితాలో వచ్చాయని గ్రామస్తులు అధికారులను నిలదీశారు.
- రామన్నపేట : మండలంలోని బోగారం, లక్ష్మాపురం, ఇస్కిళ్ల, నీర్నెంముల, పల్లివాడ, బాచుప్పల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. లక్ష్మాపురం గ్రామంలో ప్రజలు అధికారులను ప్రశ్నించడంతో సభ గందరగోళంగా మారింది. పంచాయతీ కార్యదర్శి ఎజెండా రాయకుండా గ్రామ సభ ప్రారంభం కాక ముందే గ్రామస్తులతో సంతకాలు పెట్టించు కోవడంతో స్థానిక నాయకులు అధికారులను నిలదీశారు. బోగారం గ్రామంలో జరిగిన గ్రామసభలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి పాల్గొని మాట్లాడారు.
- భువనగిరిక లెక్టరేట్ : మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ హనుమంతరావు హాజరై మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారితో పాటు అర్హత కలిగి జాబితాలో పేర్లు లేని వారు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నా స్వీకరిస్తామన్నారు. అదే విధంగా భువనరి మండలంలోని తాజ్‌పూర్, సిరివేణికుంట, మన్నెవారిపంపు, ముత్తిరెడ్డిగూడెం, వడాయిగూడెం, ఎర్రంబల్లి, జమ్మాపురం, ముస్త్యాలపల్లి, నందనం,సూరేపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించారు. తాజ్‌పూర్‌లో అదనపు కలెక్టర్ గంగాధర్, నందనంలో జెడ్పీ సీఈఓ శోభారాణి ఉన్నారు.
- వలిగొండ : మండలంలోని అక్కంపల్లి గ్రామసభలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి హాజరయ్యారు. అదే విధంగా అక్కంపల్లి, కంచనపల్లి, నర్సయ్యగూడెం, గొల్నెపల్లి, గోకారం, దుప్పెల్లి, ఎదుళ్లగూడెం, చిత్తాపురం గ్రామాల్లో సభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించి పేర్లులేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.
- బొమ్మలరామారం : మండలంలోని యావాపూర్, పెద్ద పర్వతాపూర్, తిరుమలగిరి, ప్యారారం, ఫక్కీర్‌గూడెం తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. యావాపూర్‌లో జిల్లా అడిషినల్ కలెక్టర్ గంగాధర్, తాసీల్దార్ శ్రీనివాస్‌రావు హాజరయ్యారు.
- భువనగిరి అర్బన్ : పట్టణంలో మొదటి రోజు 1, 2, 5, 7, 8, 9, 31, 26వ వార్డుల్లో సభలు నిర్వహించారు. పట్టణంలోని 8వ వార్డులో ఆర్డీఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. రేషన్ కార్డు, ఇండ్లు అనర్హులకు వచ్చాయని ప్రజలు అధికారులను నిలదీశారు.
- చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన వార్డు సభల్లో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- మోత్కూరు/అడ్డగూడూరు : మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామ సభలో ఎమ్మెల్యే సామేల్, కలెక్టర్ హనుమంతరావు హాజరయ్యారు. అదే విధంగా అడ్డగూడూరు మండలం మానాయికుంటలో కూడా ఎమ్మెల్యే సామేల్ హాజరయ్యారు.


మోత్కూరు మండలంలోని దాచారంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు


రామన్నపేట : లక్ష్మాపురం గ్రామంలో ప్రకటించిన జాబితాపై అభ్యంతరం తెలుపుతున్న గ్రామస్తులు


బొమ్మలరామారం : యావాపూర్ గ్రామంలో మాట్లాడుతున్న అడిషినల్ కలెక్టర్ గంగాధర్


మోటకొండూరు : అమ్మనబోలు గ్రామంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు


గుండాల : వంగాల గ్రామంలో అధికారిని ప్రశ్నిస్తున్న మహిళ

# గొలుసుకట్టు చెరువులను నింపాలి

- రాజాపేటలో కొనసాగుతున్న రైతు నిరసనలు


రాజాపేటలో నిరసన తెలుపుతున్న రైతులు

రాజాపేట, జనవరి 21 : కాళేశ్వరం జలాలతో గొలుసుకట్టు చెరువులు నింపాలని జల సాధన సమితి మండలాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్ కోరారు. మండల కేంద్రంలో కాళేశ్వరం 15 ప్యాకేజీ ద్వారా మండలానికి సాగు జలాలు అందించాలని రైతుల చేస్తున్న నిరసన మంగళవారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల్లోనే సాగు జలాలు అందిస్తామని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇప్పుడేమో ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. సాగు జలాలు సాధించేవరకు పార్టీలకు అతీతంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి లక్ష్మణ్, బీరప్ప, దాసు, శంకర్ పాల్గొన్నారు.

### మల్లెగూడెం చెరువు రైతుల సందర్శన

మండలంలోని మల్లెగూడెం చెరువును మంగళవారం గ్రామ రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేడ్లుగా ఈ చెరువు ఎప్పుడూ ఎండి పోలేదని, ఈ సారి చెరువులో నీటి చుక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొడుగు రాజు. రైతులు జెన్నెపల్లి బాలరాజురెడ్డి, జేనె రవీందర్‌రెడ్డి, రెడ్డబోయిన రాజు, లక్ష్మయ్య, చంద్రయ్య, రామచంద్రం, బాలరాజు, కిష్టయ్య, కనకయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

# పంటల పరిశీలన


రేణికుంటలో వరి పంటలను పరిశీలిస్తున్న నేషనల్ సర్వే అధికారులు

రాజాపేట, జనవరి 21 : మండలంలోని బేగంపేట, రేణికుంట గ్రామాల్లో 2024 – 25 ఏడాది వానకాలం సీజన్ సాగుకు సంబంధించి సర్వే నంబర్ 20లో వేసిన పంటలను మంగళవారం హైదరాబాద్ నేషనల్ శాంపిల్ సర్వే అధికారులు పరిశీలించారు. ఎన్‌ఎస్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.జయరాం మాట్లాడుతూ పంటల వివరాలను ఫరీదాబాద్ ఎన్‌ఎస్ఓకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్ఎస్ఓ విజయ, సూపర్‌వైజర్ ప్రభాకర్, ఏడీ నీలిమ, ముఖ్య ప్రణాళిక అధికారి ఎస్. లక్ష్మణ్ ఉన్నారు.

# ఆర్థిక సాయం


ముత్తమ్మ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 21 : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన పోవనపు ముత్తమ్మ మంగళవారం మృతి చెందారు. మాజీ సర్పంచ్ బండి కృష్ణ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు రేవల్లి యాదగిరి, పోవనపు ఆడవయ్యా, పవనపు నరసింహ, రేవల్లి కృష్ణ, రేవల్లి నరసింహ, రేవల్లి ప్రభాకర్, అశోక్, పర్వతం రాజేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ హనుమంతరావు

రాజాపేట, జనవరి 21 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ హనుమంతరావు హాస్టల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నెమిలె జడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆయన మ్యాథ్స్ క్లాసులు చెప్పారు. అనంతరం పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బాలామృతం పరిశీలించి, బుక్ బ్యాలెన్స్ ప్రకారం నిల్వను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ పద్మను అభినందించారు.

### గిరిజన బాలికల హాస్టల్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు


భువనగిరి అర్బన్ : గిరిజన బాలికల హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్ : పట్టణ పరిధిలోని సింగన్నగూడెం కాలనీలో గల ప్రభుత్వ గిరిజన బాలికల హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వార్డెన్ విజయలక్ష్మికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కోరిక మేరకు కంప్యూటర్లు పెట్టిస్తామని, పోటీ పరీక్షల కోసం లైబ్రరీ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. హాస్టల్ విద్యార్థుల కోసం హైదరాబాద్ చౌరస్తా వద్ద బస్సు ఆపాలని ఆర్టీసీ డీఎంను ఆదేశించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది ఉన్నారు.


జనార్దన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# జనార్దన్‌కు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి నివాళి

రామన్నపేట, జనవరి 21 : మండల కేంద్రానికి చెందిన లవణం జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి పోశబోయిన మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, గొరిగే నర్సింహ, పున్న వెంకటేశం, పట్టణ కార్యదర్శి జాడ సంతోశ్, నాయకులు మిర్యాల మల్లేశం, లవణం రాధిక రాము, బొడ్డు అల్లయ్య, ఎండీ ఎజాజ్, ఆవుల శ్రీధర్ అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నేడు చౌటుప్పల్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చౌటుప్పల్, జనవరి 21 : పట్టణ కేంద్రంతో పాటు తాళ్లసింగారం, లక్కారం, మండల పరిధిలోని జై కేసారం, వలిగొండ మండల పరిధిలోని వర్కట్‌పల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజుల సతీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ లైన్‌ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# రైతులకు అందుబాటులో యూరియా

రాజాపేట, జనవరి 21 : మండలంలోని రైతులకు 102 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియాకు ఎలాంటి కొరత లేదని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదామ్‌తో పాటు అన్ని ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉందని ఆమె చెప్పారు.

# ఇంటర్న్‌షిప్‌కు పట్టణ విద్యార్థుల ఎంపిక

భువనగిరి అర్బన్, జనవరి 21: పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాలకు చెందిన బీబీఏ లాజిస్టిక్ విద్యార్థులకు వివిధ ఎంఎన్‌సీ కంపెనీల్లో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి మంగళవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మణిపాల్‌రెడ్డి, అకాడమిక్ కో–ఆర్డినేటర్ నవీన్, అధ్యాపకులు తదితరులున్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్


# తప్పుల తడకగా సంక్షేమ పథకాల జాబితా : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న మేక అశోక్‌రెడ్డి

రామన్నపేట, జనవరి 21 : ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు కోసం రూపొందించిన జాబితా తప్పుల తడకగా, సీపీఎం నాయకుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య అన్నారు. మంగళవారం వారు మండల పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పేదలను గందరగోళ పరిచే విధంగా జాబితా ఉందని, గ్రామ సభలు పారదర్శకంగా జరుగడం లేదని, దరఖాస్తు చేసుకున్న సంఖ్యకు, అర్హుల సంఖ్యకు పొంతన లేదని మండి పడ్డారు. అధికారులను గ్రామసభల్లో నిలదీస్తే సమధానాలను దాటవేస్తూ తూతూ మంత్రంగా ముగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుంచి గ్రామ సభలను పారదర్శకంగా చేపట్టకుంటే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు బోయిన ఆనంద్, కల్లూరి నగేశ్, కందుల హన్మంతు, విజయ్‌భాస్కర్, గాదె నరేందర్, గొరిగె సోములు, నీల ఐలయ్య, పల్లె సత్యం, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

# డప్పు కళాకారుల సమావేశం.. నూతన కమిటీ ఎన్నిక


డప్పు కళాకారుల నూతన కార్యవర్గం

చౌటుప్పల్, జనవరి 21 : పట్టణంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారుల మండల, మున్సిపాలిటీల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఉబ్బు ఉపేందర్, ప్రధానకార్యదర్శిగా నక్క మహేశ్, సాంస్కృతిక కార్యదర్శిగా బర్రె సుధాకర్, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా బద్రి గాలయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డప్పు కళాకారుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మీసాల గణేశ్ మాట్లాడుతూ పిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు–వెయ్యిగొంతులు కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా స్థానిక మండలకేంద్రంలో ఈ నెల 26న వంద డప్పులతో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా ప్రధానకార్యదర్శి బోయ లింగస్వామి, మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర నాయకులు ఊదరి వెంకటేశ్ మహాజన్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బోడ్డు శ్రవణ్‌కుమార్, నాయకులు చీమకండ్ల శ్రీనివాస్, ఎర్ర శంకర్, పిట్టల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పాత ఇంట్లో కొండచిలువ



భూదాన్‌పోచంపల్లి, జనవరి 21 : మండలంలోని హైదర్‌పూర్ గ్రామానికి చెందిన గంగదేవి శంకర్ తన పాత ఇంటిని కూలుస్తుండగా అందులో నుంచి భారీ కొండ చిలువ బయటికెళ్లింది. వెంటనే గ్రామస్తులు గమనించి దాన్ని హతమార్చారు.